క్లుప్తంగా

జీవన భృతి పెంచాలి



ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీడీకార్మికులకు జీవన భృతి పెంచాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తన్న అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు, యూనియన్ నేతలు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. బీడీ కార్మికులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ పోరాడుతుందని ముత్తన్న తెలిపారు. నాయకులు శ్రీనివాస్, నజీర్, పద్మ, సునీత, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



నందిపేట్(ఆర్మూర్): రైతులు తీసుకున్న రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని ఏఐ పీపీ ఎంఎస్ జిల్లా నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏఐపీకే ఎంఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై తీర్మానాలను చేశారు. మండల కమిటీ అధ్యక్షుడు రాజలింగం, కార్యదర్శి దేవయ్య ఉన్నారు.

రైతులతో 'రచ్చబండ'

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి గ్రామంలో శనివారం బీజేపీ కిషాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి 'రైతులతో రచ్చబండ' కార్యక్రమం నిర్వహించారు. రుణమాఫీపై రైతుల అభిప్రాయాలను తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా, ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు గంగోనే సంతోష్, రాజేంధర్‌రెడ్డి, బాలాజీ, రాజు, రాములు, ప్రవీణ్, రాజు ఉన్నారు.

హామీలను నెరవేర్చాలి



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారం అన్నారు. ఈమేరకు శనివారం ఆర్మూర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.8న జరిగే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ముత్తన్న, శేఖర్, ఠాకూర్, రాజన్న, నరేందర్, పద్మ, అనిల్, గంగాధర్ ఉన్నారు.

కొత్తరుణాలు ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం రైతులకు రుణాలు మాఫీ చేసిన వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల రాజు అన్నారు. ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం వారు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు సయ్యద్, సుధాకర్, బొట్ల గంగారం, బాను బేగం పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ధర్నా నిర్వహించామని వారు తెలిపారు. నాయకులు పుట్టి నడ్పినాగన్న, పడాల శంకర్, పార్వతి రాజేశ్వర్, షేక్ నసీర్, రవి, సిద్ధ పోశెట్టి, గోపాల్, సుదర్శన్, హన్మాండ్లు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని హున్సా గ్రామానికి చెందిన టి శివకుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ పేర్కొన్నారు. జూన్ 17న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. మేనమామ హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీపై కేసు నమోదు

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న గ్రామానికి చెందిన కె శెట్టిగౌండ ఇంట్లో గత నెల 7న చోరీ జరిగింది. ఈ చోరీలో బీరువాలో ఉన్న 2.5 తులాల బంగారాన్ని దుండగులు చోరీకి పాల్పడినట్లు బాధితులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగనాథ్ పేర్కొన్నారు.

వ్యాధుల నివారణకే స్వచ్ఛదనం-పచ్చదనం

- ఈనెల 5నుంచి 9వరకు నిర్వహణ
- డీఆర్‌డీవో సాయాగౌడ్
- అన్ని మండలాల్లోనూ అవగాహన సమావేశాలు ఏర్పాటు



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి, డీసీవో శ్రీనివాస్ రావు



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

సాక్షి నెట్‌వర్క్: సీజనల్ వ్యాధుల పరిష్కారం కోసం ప్రభుత్వం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని చేపట్టబోతోందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, కమ్మర్‌పల్లి మండల ప్రత్యేకాధికారి సాయాగౌడ్ పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో శనివారం మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు 'స్వచ్ఛదనం-పచ్చదనం' పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈక్రమంలో కమ్మర్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో సాయాగౌడ్ హాజరై, మాట్లాడారు. ఈనెల 5నుంచి 9వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టబోతుందని వెల్లడించారు. తొలిరోజు గ్రామ సభ నిర్వహించి కార్యక్రమం ఆవశ్యకతను అందరికీ వివరించాలన్నారు. అనంతరం ర్యాలీ శ్రమదానం చేపట్టలన్నారు. రెండో రోజు తాగునీరు, వర్షపు నీరు సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మూడోరోజు మురుగునీటి కాలువలు, గుంతలు నీటి నిల్వ ప్రదేశాల దోమలు వృద్ధిచెందకుండా, వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నాలుగో రోజు సీజనల్ వ్యాధులు ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఐదో రోజు ప్రభుత్వ సంస్థలు, గ్రామంలోని ప్రధాన బహిరంగ ప్రదేశాల్లో శుభ్రతకై చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు గ్రామంలోని మహిళలు, యువజన సంఘాలు పౌరుల సహాయ సహకారాలు తీసుకొని గ్రామాన్ని శుభ్రంగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఆయా మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో డీసీవో శ్రీనివాస్ రావు, ఎంపీడీవోలు వెంకటేశ్‌జాదవ్, వెంకటేశ్వర్, ముజాపరుద్దీన్, ప్రత్యేకాధికారులు మధుసూదన్, రవీందర్, వేంకటేశ్వర్లు, ఎంపీవోలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రెంజల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేష్




ముప్కాల్ మండల కేంద్రంలో..



మోర్తాడ్‌లో సమావేశంలో పాల్గొన్న అధికారులు

స్నేహానికి నిదర్శనం.. పలువురికి ఆదర్శం..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన నార్ల ఉమేష్, నక్కల రామరాజు స్నేహ బంధం 30 ఏళ్లుగా కొనసాగుతూ, స్నేహానికి నిదర్శనంగా నిలుస్తున్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నారు. అలాగే భగవద్గీతలను పంపిణీ చేశారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చిన తమవంతు సహకారం అందజేస్తు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.





భగవద్గీతలను పంపిణీ చేస్తున్న ఉమేష్, రామరాజు

దోస్తులంటే ఇట్లుండాలే..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్న 2001-02 బ్యాచ్ సుమారు 70మంది విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. స్నేహితుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా, శుభకార్యాలు నిర్వహించిన వారికి మేమున్నామంటూ ముందుటున్నారు. వీరంతా వ్యవసాయ, వ్యాపార, రాజకీయ రంగాల్లో ఒక్కొక్కరు ఒక్కోస్థాయిలో స్థిరపడినా వారు ఇప్పటికీ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు.



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న తోటి మిత్రులు

హెల్పింగ్ హ్యాండ్స్



ఎడపల్లి(బోధన్): మండలంలోని పోచారం గ్రామంలో 20 మంది స్నేహితులు 2019లో డై హార్ట్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికీ గ్రామంలో పేదలకు సహాయం చేస్తున్నారు. సుమారు రూ.8 లక్షల వరకు ఆర్థిక సాయం అందించారు. స్నేహితులు గ్రామంలోని పేదలకు సహాయం చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్నేహితులంటే ప్రాణం



మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన గంగోల్ల ప్రళయ్‌తేజ్‌కు స్నేహితులంటే ప్రాణం. స్నేహితులు ఆపదలో ఉన్నారని తెలిస్తే ఎంతటి పనిలో ఉన్న క్షణాల్లో వారి వద్దకు చేరుకుని సాయం చేస్తుంటాడు. అలాగే స్నేహితులను భాగస్వామ్యం చేస్తూ నిరుపేదల కష్టా ల్లో పాలుపంచుకుంటాడు. స్నేహం అంటే ఇలా ఉండాలని ఎన్నో సందర్భాల్లో తోటి స్నేహితులు ప్రళయ్‌తేజ్ స్నేహాన్ని ఇతరులకు స్ఫూర్తి కల్గించేలా కార్యక్రమాలు చేపట్టి సన్మానిస్తారు.

మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం



దోహకత్తర్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలూర్ యువకులు



బోధన్‌లో..



సులేమాన్ నగర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈక్రమంలో శనివారం పలు మండలాల్లో ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు మందకృష్ణ మాదిగ, ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. దోహకత్తర్ దేశంలో ఉంటున్న ఆలూర్ యువకులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

రోడ్డుపై లారీలను నిలపొద్దు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆజాంగంజ్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా లారీలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు శనివారం పట్టణంలో ధర్నా నిర్వహించి, ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. ఆజాంగంజ్ కాలనీలో రైస్‌మిల్లులు ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా లారీలను నిలుపుతున్నారని, దీంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కాలనీ వాసులు గోపి, విష్ణు, రమణ, విజయ్, నాగేశ్వర్‌రావ్, రాములు, రమేష్ గౌడ్, విష్ణు వర్ధన్ గౌడ్, యాదగిరి గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన



బోధన్: శాంతి భద్రతల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే అధికారులకు కొత్త చట్టాలపై అవగాహన కలిగిఉండాలని బోధన్ కోర్టు ఏజీపీ (అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్) పమ్మయ్య, శ్యాంరావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి అన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం డివిజన్ పరిధిలోని పోలీసు, అటవీశాఖ అధికారులకు కొత్త చట్టాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ న్యాయ సంహిత చట్టం, భారతీయ నాగరిక సురక్ష, భారతీయ సాక్ష్య అధినియంపై వివిధ అంశాలను ఏజీపీలు వివరించారు. బోధన్ టౌన్, రూరల్ సీఐలు వీరయ్య, నరేష్, ఎస్సైలు కృష్ణ కుమార్, అప్పారావు, వంశీ క్రిష్ణ, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు తదిరులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు అమృతతుల్యం



మగ్గిడిలో కార్మికుల పిల్లలకు అన్న ప్రాసన నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ



గాంధీనగర్ కాలనీలో..



రుద్రూర్‌లో గర్భిణులకు సీమంతాలు

సాక్షి నెట్‌వర్క్: శిశువుకు తల్లిపాలు అమృతం వంటివని అంగన్‌వాడీ అధికారులు, టీచర్లు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతా లు చేశారు. అలాగే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారంపై, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.





అంక్సాపూర్‌లో మాట్లాడుతున్న సీడీపీవో స్వర్ణలత.. హంగర్గ గ్రామంలో..

సంక్షిప్తం

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలోని యోగేశ్వర కాలనీలోగల లిల్లీపుట్ పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకొని, శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన స్నేహ యూత్ సభ్యులు శనివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంచి పెట్టారు. యూత్ సభ్యులు ప్రళయ్‌తేజ్, పుంజు మనీష్‌గౌడ్, సందీప్, రాజు, రాకేష్, షఫీ, రంజిత్, సుధీర్, ప్రవీణ్, వినోద్, సాగర్, రాజేష్, భరత్, సిద్దాంత్, ప్రితం, గంగాధర్, సంతోష్‌లు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గోనే మణిప్రసాద్ అనే విద్యార్థి ఆలిండియా ఆయుష్ హోమియా విభాగం(హోమియోజోన్) నీట్ పీజీ ఎంట్రన్స్‌లో జాతీయ స్థాయిలో 38వ ర్యాంకు సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన గోనే కృష్ణ, సౌమ్యల కుమారుడైన మణిప్రసాద్ హోమియో విభాగంలో సత్తా చాటడంతో గ్రామస్తులు, అభినందించారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఉంటున్న చేపూర్ నిశాంత్ నీట్‌లో రాష్ట్రస్థాయిలో 856 ర్యాంకు సాధించాడు. ఈసందర్భంగా నిశాంత్ తల్లిదండ్రులు చేపూర్ గణేష్, జయశ్రీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వర్ని: రుద్రూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో వంట మనిషి పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం శ్యామల ఒక ప్రకటనలో తెలిపారు. 18సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే పదో తరగతి విద్యా అర్హత కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తిగలవారు ఈనెల 4లోపు కేజీబీవీలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

సంజీవ్‌కుమార్‌కు నివాళి



కమ్మర్‌పల్లి: ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ ఇటీవల మృతిచెందారు. దీంతో శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సంజీవ్ చిత్రపటానికి మండలంలోని ఈజీఎస్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీఆర్‌డీఓ సాయాగౌడ్, ఎంపీడీఓ రాజశ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, టీఏలు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

వర్ని: కేరళ వరద బాధితుల కోసం సీపీఎం వర్ని ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. సుమారు రూ.3,890 విరాళాలు వచ్చాయని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు. జిల్లా కమిటీ ద్వారా కేరళ రాష్ట్రంలోని, వయనాడ్ బాధితులకు పంపిస్తామని అన్నారు. నాయకులు సాయిబాబా లక్ష్మణ్, నరేష్ పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీకి సన్మానం

మోర్తాడ్: మండలంలోని పాలెంలో శనివారం మాజీ వైస్ ఎంపీపీ తొగటి శ్రీనివాస్‌ను శాలివాహన సంఘం నాయకులు సత్కరించారు. సంఘం అధ్యక్షుడు ఏనుగంటి మహేష్, సభ్యులు ఏనుగంటి గంగాధర్, సిద్దయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ

బోధన్: పట్టణంలోని రాకాసీపేట ఎస్సీ బాలుర హాస్టల్(ఏ) విద్యార్థుల సౌకర్యార్థం శనివారం మూడు టేబుల్ ఫ్యాన్‌లను లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ప్రతినిధులు కొత్తపల్లి శ్రీకాంత్-సవిత దంపతులు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు సుబ్బారావు, పోశెట్టి, కవిత, మంజూష, వెంకటలక్ష్మి, గోపాల కృష్ణ, మేరి, వార్డెన్ నవీన్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

బోధన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో స్థలంలో హెచ్‌పీసీఎల్ (హిందూస్తాన్ పెట్రోలియం కంపెనీ లిమిటెడ్) కొత్తగా పెట్రోల్ బంక్ ఏర్పాటు కసరత్తు చేస్తోంది. ఈమేరకు శనివారం ఆ కంపెనీ నియమించిన కన్స్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు ప్రతినిధులు డిపోను సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. సదరు కంపెనీకి స్థలాన్ని లీజుకు ఇచ్చి, రెండుమూడేళ్లనంతరం పెట్రోల్ బంక్‌ను ఆర్టీసీకి అప్పగిస్తారని డీఎం శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషాధారణలతో ఆటపాటలతో ఆకట్టుకున్నారు. దేవతలకు బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. హెచ్‌ఎం సురేశ్‌కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

ఎడపల్లి తహసీల్దార్‌గా అనూష

ఎడపల్లి(బోధన్): మండల తహసీల్దార్‌గా అనూష శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనూష పౌరసరఫరా శాఖలో పని చేశారు. బదిలీపై ఎడపల్లి వచ్చారు. అలాగే ఎడపల్లి ఏఎస్‌వోగా ఇందు బాధ్యతలు చేపట్టారు.

సీసీ కెమెరాల వితరణ

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం హెచ్‌ఎం శ్రీనివాస్‌కు సీసీ కెమెరాలను అందజేశారు. పాధ్యాయులు రఘునాథ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



వర్ని: రుద్రూర్ మండలంలోని రాయకూరు గ్రామంలో గత నాలుగు నెలలుగా వీధి దీపాలు ఏర్పాటు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం జీపీ కార్యాలయం ఎదుట వారు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సమస్యను అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. మాజీ ఎంపీటీసీ శ్యామ్, చాకలి గంగాధర్, నీరడి నాగయ్య, తుకారాం పాల్గొన్నారు

విద్యుత్ అధికారుల పొలంబాట



రెంజల్(బోధన్): మండల కేంద్రంలో శనివారం ట్రాన్స్‌కో అధికారులు పొలంబాట నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకునాలని వివరించారు. కెపాసిటర్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏఈ రాజలింగం, లైన్‌మెన్‌లు, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



ఎడపల్లి(బోధన్): పంట రుణామాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందవద్దని ఏవో సిద్దిరామేశ్వర్ అన్నారు. రుణమాఫీ పొందని రైతులు శనివారం సిండికేట్ బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులకు ఇప్పటివరకు రూ.1.50 లక్షల వరకు క్రాప్‌లోన్ మాఫీ వచ్చిందన్నారు. ఎవరికైతే రాలేదో అటువంటి రైతులు ఆధార్ కార్డు ఇచ్చి వారి స్టేటస్ తెలుసుకోవాలన్నారు. అలాగే పలువురికి ధృపత్రాల్లో మార్పులు చేర్పులు ఉండటంతో రుణామాఫీ రాలేదని వాటిని సరిచేసి రుణామాఫీ అందిస్తామన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 - రాయన్ (తెలుగు) - 12.15, 7.10 కల్కి 2898 ఏడీ (తెలుగు) - 3.25, 10.20

స్క్రీన్-2 - డెడ్‌పూల్ 3డీ (తెలుగు)- 10.00, 4.00, 10.00, బడ్డీ (తెలుగు) 1.00, 7.00

స్క్రీన్-3 - యావరేజ్ స్టూడెంట్ నాని (తెలుగు) - 1.45, తిరగబడర సామీ (తెలుగు) 7.20, రాయన్ (తెలుగు) 10.30

స్క్రీన్-4 - శివం భజే (తెలుగు) - 11.00, 1.45 7.35, 10.20, ఉషా పరిణయం (తెలుగు) 4.30

ప్రభుత్వ కొలువులు సాధించిన ఆర్మూర్ యువకులు



కోశనం అభినవ్



గైని సాగర్



కామని అమూల్య



సింధూ

పెర్కిట్(ఆర్మూర్)/వేల్పూర్/భీమ్‌గల్(బాల్కొండ): శుక్రవారం విడుదలైన టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని యువకులు పలు శాఖల్లో ప్రభుత్వ కొలువులు సాధించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన గైని సాగర్ మిషన్ భగీరథ శాఖలో ఏఈఈగా, అలాగే పెర్కిట్‌కు చెందిన కోశనం అభినవ్ పంచాయత్‌రాజ్ శాఖలో ఏఈఈగా, పెర్కిట్‌కు చెందిన అమూల్య మిషన్ భగీరథలో ఏఈఈగా, ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామానికి చెందిన సింధూ పంచాయత్‌రాజ్ శాఖలో ఏఈఈగా కొలువులు సాధించారు. వేల్పూర్‌కు చెందిన ప్రశాంత్ అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన వేముల అరుణ్ పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) (గెజిటెడ్ ఆఫీసర్) గా ఉద్యోగం సాధించారు.